

# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 124 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- సోమవారం 09 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ప్యూన్ ఘరానా మోసం ..రూ.10 కోట్ల కుంభకోణం

అక్రమ నగదుతో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందేందుకు భూములు కొనుగోలుకు యత్నించిన మధ్యప్రదేశ్కు చెందిన ప్యూన్, మరో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు.



భోపాల్,డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): మధ్యప్రదేశ్ లో ఓ ఘరానా మోసం చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ కార్యాలయంలో ప్యూన్ (%జూవశీఅ%) గా పని చేసే బ్రిజేంద్రదాస్ నామేవ్ అనే వ్యక్తి మరో ఐదుగురి సాయంతో రూ.10 కోట్ల కుంభకోణానికి ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు తొలుత బ్రిజేంద్రను ప్యూన్గా కాకుండా డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారిగా చూపించి బ్యాంకుల్లో పనిచేస్తున్న మరికొందరు నిందితుల సాయంతో విత్తన ధ్రువీకరణ విభాగానికి సంబంధించిన నకిలీ పత్రాలు, డాక్యుమెంట్లను చూపించి రూ.10 కోట్లను అతడి అకౌంట్కు ట్రాన్స్ఫర్ చేశారు.అనంతరం ఆ మొత్తాన్ని 50 వేర్వేరు అకౌంట్లకు బదిలీ చేసి, ఆ నగదుతో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందేందుకు భూముల కొనుగోలుకు యత్నించారు. ప్రభుత్వ జాతీయ పశుసంవర్ధక పథకం కింద కొనుగోలు చేసిన భూమిలో ప్రాజెక్టను ప్రారంభించి, ఈ పథకం ద్వారా వచ్చే సబ్సిడీని పొందాలని ప్లాన్ చేశారు. శాఖాపరమైన ఇబ్బందులు రాకుండా నకిలీ దస్త్రాలు, సీళ్లు సైతం తయారుచేశారు. అయితే వారి పథకం బెడిసి కొట్టడంతో ప్యూన్తో సహా ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశా-రు.బ్రిజేంద్రదాస్ ప్రవర్తనపై విత్తన ధ్రువీకరణ అధికారి సుఖైవ్ ప్రసాద్ అహిర్వార్కు అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడని.. దీంతో ఈ కుంభకోణం బయటకు వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఈ కుంభకోణానికి ప్రధాన నిందితుడైన బ్రిజేంద్రదాస్ నా%ఌ%వ్ నాలుగు నెలల కిందటే పథక రచన చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశామని.. వారి వద్ద ఉన్న నకిలీ పత్రాలు, భూములను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

## బంగ్లాదేశకు భారత విదేశాంగశాఖ కార్యదర్శి..!

బంగ్లాదేశ్తో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరిన వేళ కీలక పరిణామాలు చోటు చేసుకొన్నాయి. మన విదేశాంగశాఖ కార్యదర్శి ఢాకా పర్యటనకు వెళ్లారు.



డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): ద్వైపాక్షిక సంబంధాల్లో ఉద్రిక్తతలు తలెత్తడంతో చర్చలు జరిపేందుకు భారత కార్యదర్శి విక్రమ్ మిశ్రి బంగ్లాదేశ్ కు వెళ్లారు. ఆ దేశ విదేశాంగశాఖ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్ తో ఆయన కీలక అంశాలను చర్చించే అవకాశం ఉంది. సోమవారం ఉదయం భారత వాయుసేన విమానంలో విక్రమ్ ఢాకా చేరుకొన్నారు. బంగ్లాదేశ్లో ఆయనకు విదేశాంగ మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి స్వాగతం పలికారు. ఆ తర్వాత మిశ్రి-మహమ్మద్ జషీముద్దీన్ లు చర్చలు జరిపారు.

# తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు ..4 కోట్ల బిడ్డల భావోద్వేగం: సీఎం రేవంత్

డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడారు.



హైదరాబాద్, డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారని చెప్పారు. 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అన్న దాశరథి మాటలు నిత్యసత్యమని పేర్కొన్నారు. భూ ప్రపంచంలో ఏ జాతికైనా గుర్తింపు.. ఆ జాతి అస్తిత్వమే అని చెప్పారు. అస్తిత్వానికి మూలం సంస్కృతి.. సంస్కృతికి ప్రతిరూపమే తల్లి అని వివరించారు."స్వరాష్ట్ర పోరాట ప్రస్థానంలో సకల జనులను ఐక్యం చేసింది తెలంగాణ తల్లి. తెలంగాణ జాతి భావనకు జీవం పోసింది. నిరంతరం చైతన్యపరిచి లక్ష్యసాధన వైపు నడిపింది. తెలంగాణ తల్లి స్వరూపానికి అధికారిక గుర్తింపు లేదు. ప్రజాపోరాటాలకు ఊపిరి పోసుకున్న మాతృమూర్తిని గౌరవించుకునేందుకు నిర్ణయించాం. సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు.. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం. ప్రజల మనోఫలకాల్లో నిలిచిన రూపాన్ని సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించుకుంటున్నాం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని విగ్రహానికి రూపకల్పన చేశాం.తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతులను పరిగణనలోకి తీసుకున్నాం. ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టుబొట్టుతో తీర్చిదిద్దాం. గుండుపూసలు, హారం, ముక్కుపుడకను పొందుపర్చాం. ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క-సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి రూపకల్పన చేశాం. సంప్రదాయ పంటలైన వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్నలు ఆ తల్లి చేతిలో కనిపించేలా ఏర్పాటు చేశాం. చరిత్రకు దర్పణంగా నిలుచున్న విగ్రహాన్ని రూపొందించాం. ఉద్యమాలు, ఆత్మ బలిదానాలకు సంకేతంగా పీఠంలో పిడికళ్లను పొందుపరిచాం" అని రేవంత్రెడ్డి వివరించారు.

## సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలోనూ తెలంగాణ వచ్చేది కాదు: కోమటిరెడ్డి

సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు.. నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు అని అభివర్ణించారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత గతంలో స్వయంగా ప్రకటించారని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదని చెప్పారు. అమ్మలాంటి తెలంగాణ తల్లిని ఆవిష్కరించుంటున్న ఈరోజు.. సభకు వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి.. బయట నిరసనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలి: మంత్రి పొన్నంతెలంగాణ రావడానికి కారణం సోనియాగాంధీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ చిహ్నంలో మా-ర్పు జరగలేదన్నారు. తెలంగాణ గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఇటీవల వరదలు వస్తే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## గత పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆవిష్కరించారా?: మంత్రి సీతక్క

సొంత అజెండాతో తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు.



హైదరాబాద్, డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): సొంత అజెండాతో తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. తమ ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో రాష్ట్ర ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక జీవనరూపం, ఆశీర్వాదం కలగలిసిన నిండైన రూపముందని చెప్పారు. శా-సనసభలో సీతక్క మాట్లాడారు."తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నామంటూ భారాస, భాజపా నేతలు మాపై విమర్శలు చేస్తున్నారు. గత పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడైనా అధికారికంగా ఆవిష్కరించారా? కేటీఆర్ సోదరికి దేవతా విగ్రహ రూపాన్ని ఇస్తే ఎలా ఉంటుందో అలా పెట్టుకొని దాన్ని రాష్ట్ర ప్రజలపై రుద్దారు. నేడు మేం తెలంగాణ బిడ్డల అస్తిత్వానికి అనుగుణంగా ఉండేలా విగ్రహాన్ని రూపొందించాం. గుండెల నిండా పాడుకునే 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర గీతంగా ఏర్పాటుచేయాలనే ఆలోచన గత పాలకులకు రాలేదు. నేడు మేం చేస్తుంటే అడ్డుకుంటున్నారు.ఉద్యమ సమయంలో టీజీ అని.. అధికారంలోకి వచ్చాక టీఎస్ అని మార్చారు. అప్పుడు భాజపా మాట్లాడలేదు. పార్టీ పేరులో తెలంగాణ పదాన్ని తొలగించారు. ఇప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పెట్టిన విగ్రహాన్ని చూస్తుంటే మా అక్కాచెల్లెళ్లను చూసినట్లే ఉంది. తెలంగాణ మహిళలు మట్టి బిడ్డలు.. ఆ శ్రామిక తత్వానికి ప్రతిరూపంగా రూపొందించాం" అని సీతక్క అన్నారు.

## రేవంత్ రెడ్డి దుశ్చర్యతో తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతోంది: ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.



హైదరాబాద్,డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారని భారాస ఎమ్మెల్సీ కవితవిమర్శించారు. సీఎం రేవంత్రెడ్డి దుశ్చర్యతో తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతోందని మండిపడ్డారు. విగ్రహం నుంచి బతుకమ్మను మాయం చేశారని.. తెలంగాణ ప్రత్యేకత లేకుండా చేశారని చెప్పారు. ఆమెకు నివాళులర్పించే అర్హత రేవంత్రెడ్డికి లేదని కవిత పేర్కొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 5 బిల్లులు.. 2 నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు..



హైదరాబాద్, డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 5 బిల్లులు.. 2 నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు, డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన తదితర అంశాలపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రకటన చేస్తారు. ఈ అంశంపై స్వల్ప చర్చ చేపట్టే అవకాశాలున్నాయి. తర్వాత పలు సంతాప తీర్మానాలు ప్రవేశపెడతారు. అనంతరం సభ వాయిదా పడే అవకాశాలున్నాయి. ఈ సమావేశాల్లోనే రైతు భరోసా విధివిధానాలపై చర్చించనున్నారు.

## జైపూర్, ఢిల్లీలో పర్యటించనున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): డిసెంబర్ 11 నుంచి 13 వరకు మూడు రోజులపాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళ్లనున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం.. తొలి రోజు రాజస్థాన్లోని జైపుర్ వెళ్లనున్న సీఎం.. తర్వాతి రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై వివిధ శాఖల మంత్రులు, అధికారులతో చర్చించనున్నారు. పార్టీ అధిష్ఠానంతోనూ సీఎం భేటీ అయ్యే అవకాశముంది.మరోవైపు అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16 వరకు వాయిదా పడిన నేపథ్యంలో.. పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్యనేతలు కూడా సీఎంతోపాటు ఢిల్లీ వెళ్లే అవకాశముంది. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై పార్టీ హైకమాండ్ తో చర్చించే అవకాశముంది.

## తప్పు చేసిన వారెవరినీ వదిలే ప్రసక్తే లేదు :హోంమంత్రి అనిత

గత వైకాపా ప్రభుత్వంలో అధికారులను విపరీతంగా బెదిరించారని హోంమంత్రి అనిత విమర్శించారు.

విజయవాడ, డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): గత వైకాపా ప్రభుత్వంలో అధికారులను విపరీతంగా బెదిరించారని హోంమంత్రి అనిత విమర్శించారు. కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు అందరినీ బెదిరించారన్నారు. విజయవాడలో సబ్జైలును ఆమె ఆకస్మికంగా సందర్శించి ఖైదీలతో ముఖాముఖి నిర్వహించారు. "ప్రజలు మంచి నిర్ణయం తీసుకుని మాకు అధికారమిచ్చారు. ఖైదీని ఖైదీలా.. ముద్దాయిని ముద్దాయిలా చూడాలి. తప్పు చేసిన వారెవరినీ వదిలే ప్రసక్తే లేదు. కచ్చితంగా నిఘా ఉంటుంది.. చర్యలు తప్పవు. సబ్ జైలు మౌలిక వసతులపై ఆరా తీశాం. జైలులో అధికారులపై వస్తున్న ఆరోపణలపై వివరాలు సేకరించాం. విచారణ జరుగుతోంది.



రెండు రోజుల్లో నివేదికవస్తుంది. దానిపై త్వరలో చర్యలు తీసుకుంటాం.తమ తప్పులు బయట పడుతున్నాయన్న భయంతో విజయసాయి రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి మాట్లాడే స్థాయి ఆయనది కాదు. విజయసాయి రెడ్డిపై తప్పకుండా కేసులు నమోదు చేస్తాం. కాకినాడ పోర్టు కేసులో విచారణ జరుగుతోంది. వైకాపా నేతలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు. జగన్ అండ్ కో ఏపీ సంపదను దోచుకున్నారు" అని అనిత విమర్శించారు.

# నంద్యాల జిల్లాలో దారుణం

## :పెట్రోల్ పోసి నిప్పంటించిన యువకుడు.. బాలిక మృతి

నంద్యాల జిల్లా నందికొట్కూరులో దారుణం చోటుచేసుకుంది.

బాలికపై యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు.



నందికొట్కూరు, డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల జిల్లా నందికొట్కూరులో దారుణం చోటుచేసుకుంది. ప్రేమించలేదనే కారణంతో బాలికపై యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో బాలిక మృతిచెందింది. యువకుడికి మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం సామర్లకోటకు చెందిన బాలికను కలుగొట్లకు చెందిన యువకుడు రాఘవేంద్ర (21) కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఆమెను నందికొట్కూరులోని అమ్మమ్మ ఇంటికి పంపారు. ఆరు నెలల క్రితం యువకుడు అక్కడికి వచ్చాడు. దీంతో ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చేరవేశారు. బాలిక స్నేహితులు ఎవరు వచ్చినా ఇంటికి రానివ్వొద్దని వారు సూచించారు.అయితే ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆ రాఘవేంద్ర మళ్లీ వచ్చాడు. చదువుకునే గదిలో బాలికనిద్రిస్తుండగా డోర్ కొట్టాడు. డోర్ తెరవడంతో లోపలికి వెళ్లి గడియపెట్టాడు. ఆ తర్వాతకాసేపటికి బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు పెడుతూఅక్కడికక్కడే మృతిచెందింది. యువకుడికీ మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. అతడుగడియ తీసి పారిపోతుండగా కుటుంబసభ్యులు, స్థానికులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారంఇవ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయాలతో ఉండటంతో రాఘవేంద్రను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# కాకినాడ జిల్లాలో పులి సంచారం!..

## భయాందోళనలో స్థానికులు

కాకినాడ జిల్లాలో మళ్లీ పులి వచ్చిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్తిపాడు సమీప ప్రాంతాల్లో అది సంచరించినట్లు సమాచారం.



ప్రత్తిపాడు, డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): కాకినాడ జిల్లాలో మళ్లీ పులి వచ్చిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్తిపాడు సమీప ప్రాంతాల్లో అది సంచరించినట్లు సమాచారం. బాపన్నధార పరిసర ప్రాంతాల్లో ఓ పశువు మృతి చెందడం అనుమానాలను బలపరుస్తోంది. ఈ ఘటనపై స్థానికులు అటవీ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈక్రమంలో ఆదివారం బాపన్నధార, ధారపల్లి, బురదకోట పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పులి సంచారంపై అధికారులు సోమవారం స్పష్టత .2022 మేలో 37 రోజుల పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పులి సంచరించింది. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం, తుని మండలాల్లో సంచరించింది. ఇటీవల సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు సుమారు 45 రోజులు రాజమహేంద్రవరం, కడియం, ఆలమూరు, రావులపాలెం పరిసర ప్రాంతాల్లో పులి తిరిగింది. తాజాగా ప్రత్తిపాడు మండలంలోనూ సంచరించిందనే సమాచారంతో స్థానికులంతా భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం ప్రత్తిపాడు ప్రాంతంలో పోలీసులు విచారించారు.

# తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాజకీయం చేస్తే చరిత్ర క్షమించదు :కూనంనేని

భారాస సభ్యులు సభలో ఉంటే బాగుండేదని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



హైదరాబాద్, డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): సభలో భారాస సభ్యులు ఉంటే బాగుండేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేనిసాంబశివరావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. భారాస కోరుకున్నట్లు తెలంగాణ తల్లి రూపం ఉండదన్నారు. కవులు, కళాకారులు, మేధావుల సలహాలు, సూచనల మే-రకు రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఒక్కొక్కరూ ఒక్కో పాత్ర పోషించారని చెప్పారు. రాజకీయ కోణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని వివాదం చేస్తే చరిత్ర"తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలి. ఈ అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నామని చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. తెరాసను భారాసగా మార్చుకోవచ్చు.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా రూపకల్పన చేస్తే తప్పు జరిగినట్లా? తెలంగాణ తల్లి విగ్రహం కన్నతల్లిలా ఉండాలనేదే ఉద్దేశం" అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

# ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ..విజయం దిశగా గోపీమూర్తి

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. కాకినాడ జెఎన్టీయూలో కౌంటింగ్ జరుగుతోంది.





కాకినాడ, డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. కాకినాడ జెఎన్టీయూలో కౌంటింగ్ జరుగుతోంది. పీడీఎఫ్ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి బొర్ర గోపీమూర్తి విజయం దిశగా దూసుకెళ్తున్నారు. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఇప్పటి వరకు సుమారు 9వేల ఓట్లు ఆయనకు వచ్చినట్లు సమాచారం.ఆ తర్వాత స్థానంలో మరో స్వతంత్ర అభ్యర్థి గంధం నారాయణరావు ఉన్నారు. ఆయనకు దాదాపు 5వేల ఓట్లు పోలైనట్లు తెలిసింది. ఈ ఉప ఎన్నికలో మొత్తం 15,495 ఓట్లు పోలయ్యాయి. బొర్ర గోపీమూర్తి విజయం దాదాపు ఖరారు కావడంతో ఆయన వర్గీయులు సంబరాలు చేసుకుంటున్నారు.

# కడప పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరైన అవినాష్ రెడ్డి పీఏ

వైకాపా ఎంపీ అవినాష్రెడ్డి పీఏ రాఘవరెడ్డి కడపలో పోలీసు విచారణకు హాజరయ్యారు.



కడప, డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): వైకాపా ఎంపీ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి కడపలో పోలీసు విచారణకు హాజరయ్యారు. ఆయనకు ఇటీవల పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. దీంతో కడప సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్కు విచారణకు వచ్చారు. వర్రా రవీంద్రరెడ్డి కేసులో రాఘవరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల తర్వాత ఆయన పులివెందుల రావడంతో పోలీసులు నోటీసులిచ్చారు. ప్రస్తుతం పోలీసు స్టేషన్లో డీఎస్పీ మురళీ నాయక్ ఆయన్ను విచారిస్తున్నారు. సునీత, షర్మిల, విజయమ్మపై వర్రా రవీంద్రరెడ్డితో అసభ్యకర పోస్టులు పెట్టించారని రాఘవరెడ్డిపై ఆరోపణలున్నాయి.

# చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడే ..తేల్చిచెప్పిన హైకోర్టు

వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కు తెలంగాణ హైకోర్టు లో షాక్ తగిలింది.



హైదరాబాద్, డిసెంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్): వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కు తెలంగాణ హైకోర్టు (టి.యస్ )లో షాక్ తగిలింది. పౌరసత్వం కేసులో దాఖలు చేసిన పిటిషన్ ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడేనని హైకోర్టు తేల్చిచెప్పింది.జర్మనీ పౌరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచారని.. తప్పుడు డాక్యుమెంట్లతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారని ఉన్నత న్యాయ-స్థానం వ్యాఖ్యానించింది. ఆయనకు రూ.30లక్షల జరిమానా విధించింది. నెలలోపు చెల్లించాలని స్పష్టం చేసింది. దీనిలో రూ.25 లక్షలు ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్కు, రూ.5 లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. తప్పుడు సమాచారంతో ఎన్నికల్లో పోటీ చేశారంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆది శ్రీనివాస్ గతంలో చెన్నమనేని రమేశ్కు వ్యతిరేకంగా ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

# భాజపా రాజ్యసభ అభ్యర్థిగా ఆర్. కృష్ణయ్య

మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను భాజపా ప్రకటించింది. ఏపీ నుంచి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కు అవకాశం కల్పించింది.



దిల్లీ, డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను భాజపా ప్రకటించింది. ఏపీ నుంచి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కు అవకాశం కల్పించింది. గతంలో ఆయన వైకాపా నుంచి రాజ్యసభకు ఎన్నికై ఇటీవల రాజీనామా చేశారు. ఆర్. కృష్ణయ్యతో పాటు హరియాణా నుంచి రేఖాశర్మ, ఒడిశా నుంచి సుజిత్కుమార్ను అభ్యర్థులుగా భాజపా ఎంపిక చేసింది.

# నడిరోడ్డు పైనే మమ్మల్ని అడ్డుకోవడం సమంజసమా?: కేటీఆర్

సీఎం రేవంత్- అదానీ ఫొటో ముద్రించిన టీషర్టులతో వెళ్లిన తమను అసెంబ్లీలోకి అనుమతించకపోవడంపై భారాస నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు.



హైదరాబాద్, డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): సీఎం రేవంత్- అదానీ ఫొటో ముద్రించిన టీషర్టులతో వెళ్లిన తమను అసెంబ్లీలోకి అనుమతించకపోవడంపై భారాస-నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ గేటు వద్ద నిరసన కొనసాగించారు. అదానీ-రేవంత్ బొమ్మ ఉన్న టీషర్టులతోనే లోపలికి వెళ్తామని తేల్చి చెపా-ఏరు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేటీఆర్, హరీశ్రావు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.



అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్కు రాహుల్గాంధీ, కాంగ్రెస్ ఎంపీలు అదానీ ఫొటో ఉన్న టీషర్టులు ధరించి వెళ్లారన్నారు. "లగచర్ల ప్రజల తరపున నిరసన తెలిపేందుకు సభకు వెళ్తున్నాం. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల తరపున పోరాడతాం. నడిరోడ్డుపైనే ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సమంజసమా? అదానీకి కాంగ్రెస్ నేతలు దాసోహం అంటున్నారు. అదానీ-రేవంత్ బంధాన్ని బయట పెడతాం. పోలీసులను అడ్డుపెట్టుకొని సభకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ కడుతున్నారు. ఆ పార్టీ దుర్మార్గ వైఖరికి వ్యతిరేకంగా అసెంబ్లీలో నిరసన తెలుపుతాం"అని చెప్పారు.రాహుల్ కు ఒక నీతి.. రేవంత్ కు మరో నీతా?: హరీశ్ రావు హరీశ్ రావు మాట్లాడుతూ "అదానీ ఫొటో ఉన్న టీషర్టులు ధరించి కాంగ్రెస్ నేతలు పార్లమెంట్కు వెళ్లారు. దిల్లీలో రాహుల్గాంధీ, కాంగ్రెస్ నేతలు ఆ టీషర్టులు వేసుకొని వెళ్తే మీకు ఫర్వాలేదు. రాష్ట్రంలో మేం నిరసన తెలుపుతూ టీషర్టులు ధరిస్తే మీకు ఇబ్బందేంటి? రాహుల్గాంధీకి ఒక నీతి.. రేవంత్రెడ్డికి మరో నీతి ఉంటుందా? కాంగ్రెస్ పార్టీకి ఒక సిద్ధాంతం లేదా? రాష్ట్రంలో దుర్మార్గ, అరాచక పాలన సాగుతోంది. ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు యత్నిస్తున్నారు. సభలో ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయాలని ఎవరైనా ఉద్యమాలు చేశారా? కొత్తగా రూపొందించిన విగ్రహంలో బతుకమ్మను తొలగించి చెయ్యి గుర్తు పెట్టారు. అలా చేయడం తెలంగాణ మహిళలను కించపరచడమే. రాష్ట్ర ప్రజలకు ఇది అవమానం. కేసీఆర్పై కుట్రతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారు.

# సందేహాలు పెరిగాయ్.. విశాఖ డెయిరీపై ఆడిట్ జరగాలి: జ్యోతుల నెహ్రూ




విశాఖపట్నం, డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): విశాఖ డెయిరీలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేసిన అసెంబ్లీ సభా సంఘం సోమవారం విశాఖ డెయిరీని పరిశీలించింది. ఎమ్మెల్యే నెహ్రూ ఆధ్వర్యంలో సభ్యులు విశాఖ డెయిరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ ఆదేశాలతో డెయిరీని పరిశీలించినట్లు చెప్పారు. పరిశీలన తర్వాత సందేహాలు మరింత పెరిగాయని, నిపుణుల కమిటీ సహకారం తీసుకుంటామని చెప్పారు. విశాఖ డెయిరీపై ఆడిట్ జరగాల్సి ఉందన్నారు.ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఛైర్మన్గా, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, పల్లా శ్రీనివాసరావు, గౌతు శిరీష, ఆర్వీఎస్కేకే రంగారావు, దాట్ల సుబ్బరాజులను సభ్యులుగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు హౌస్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. "హౌస్ కమిటీ పరిశీలన సమయంలో డెయిరీ ఛైర్మన్ హాజరు కాలేదు. మాతో కేవలం ఎండీ మాత్రమే మాట్లాడారు. విశాఖ డెయిరీ 4 జిల్లాల పరిధిలో ఉంది. ఆయా జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తాం. పాడి రైతులకు నష్టం జరగకుండా నిర్ణయం తీసుకుంటాం. మా కమిటీ నివేదికను అసెంబ్లీకి అందిస్తాం" అని జ్యోతుల నెహ్రూ చెప్పారు.స్పీకర్ ఆదేశాలతోనే విశాఖ డెయిరీపై హౌస్ కమిటీ వేసినట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. డెయిరీ విషయంలో అనేక అనుమానాలు, సందే-హాలు ఉన్నాయన్నారు. పాడి రైతులను అడిగితే డబ్బులు తగ్గించారంటున్నారని, యాజమాన్యం మాత్రం అదేమీ లేదని చెబుతోందని మీడియాకు తెలిపారు. డెయిరీని హౌస్ కమిటీ మరోమారు పరిశీలిస్తుందని తెలిపారు.

# కొనసాగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

కాకినాడలోని జేఎన్టీయూలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు. కొనసాగుతోంది.




కాకినాడ,డిసెంబర్ 09 , (రిపబ్లిక్ న్యూస్): కాకినాడలోని జేఎన్టీయూలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. కౌంటింగ్ ప్రక్రియను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. జేఎన్టీయ-యూలోని అంబేడ్కర్ కేంద్ర గ్రంథాలయంలో లెక్కింపు సాగుతోంది. 9 రౌండ్లలో లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు.ఈ నెల 5న ఈ నియోజకవర్గం పరిధిలోని కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు (11 మండలాలు) జిల్లాల్లో పోలింగ్ నిర్వహించగా 15,495 మంది ఓటేశారు. పోటీలో గంధం నారాయణరావు, దీపక్ పులుగు, డాక్టర్ నాగేశ్వ-రరావు కవల, నామన వెంకటలక్ష్మి, బొర్రా గోపీమూర్తి ఉన్నారు. విజేతగా నిలిచిన వ్యక్తికి రెండేళ్ల 2 నెలల పదవీ కాలం ఉంటుంది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# పార్ట్ వన్ పూర్తి చేశా.. బాలీవుడ్ 'రామాయణ'పై రణ్ బీర్కపూర్ అప్ డేట్



నితేశ్ తివారీ దర్శకత్వంలో 'రామాయణ' తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై రణ్బీర్కపూర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. షూటింగ్ అప్డేట్ పంచుకున్నారు. బాలీవుడ్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' నితీశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి భారీ బడ్జెట్తో అల్లు అరవింద్ దీన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో రాముడిగా బాలీవుడ్ హీరో రణ్బీర్ కపూర్ నటిస్తుండగా.. సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ అపడేట్ను రణ్ బీర్ పంచుకున్నారు. తన కల నిజమైందని ఆనందం వ్యక్తంచేశారు."రామాయణ ప్రాజెక్ట్ వర్క్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది ఎంతో గొప్ప కథ. చిన్నప్పటినుంచి వింటూ పెరిగాం. ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులు ఇందులో వర్క్ చేస్తున్నారు. నితీశ్ తివారి దీన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. రెండు భాగాలుగా ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. పార్ట్1 లో నా భాగం షూటింగ్ పూర్తి చేశాను. త్వరలోనే పార్ట్2 చిత్రీకరణ కూడా ప్రారంభమవుతుంది. ఇలాంటి పాత్రలో నటించడం నాకు కల. ఈ చిత్రంతో ఆ కల నిజమైంది. మన భారతీయ సంస్కృతి, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప సినిమా "రామాయణ" అని చెప్పారు ఇటీవలే ఈ సినిమా గురించి నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. విడుదల తేదీలను తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగం విడుదల కానున్నట్లు వెల్లడించింది.కొన్ని నెలలుగా ఈ సినిమాకు సంబంధించిన ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతూనే ఉన్నాయి. ఈ చిత్రం షూటింగ్కు సంబంధించిన కొన్ని ఫొటోలు కూడా లీక్ అయ్యాయి. సైలెంట్గా చిత్రీకరణను పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో తన పాత్ర కోసం రణ్బీర్ శిక్షణ తీసుకున్నారు. డైట్ ఫాలో అవుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యేవరకు మద్యపానం మానేసినట్లు చెప్పారు. సీత పాత్రలో నటించడం తన అదృష్టమని సాయిపల్లవి తెలిపారు. ఇక ఇందులో రావణుడిగా యశ్ కనిపించనున్నారు. హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీతిసింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది.



# అల్లు అర్జున్ ప్రతిభకు నేను అభిమానిని ..బన్నీని ప్రశంసించిన అమితాబ్

**అల్లు అర్జున్ గతంలో మాట్లాడిన వీడియోను అమితాబ్ బచ్చన్ షేర్ చేశారు. బన్నీపై ప్రశంసలు కురిపించారు.**

అల్లు అర్జున్ పై బాలీవుడ్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ ప్రశంసలు కురిపించారు. బన్నీ వ్కు తాను అభిమానినని పేర్కొన్నారు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పుష్ప: ది రూల్ 2). తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణను సొంతం చేసుకుంటోంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ సినిమా ప్రచారంలో భాగంగా అల్లు అర్జున్ అన్ని ప్రముఖ నగరాల్లో ఈవెంట్లు నిర్వహించిన సంగతితెలిసిందే.ముంబయిలో ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బన్నీ మాట్లాడుతూ.. అమితాబ్ (అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. ఆయన ఎన్నో సంవత్సరాల నుంచి ఇండస్ట్రీలో స్టార్ ఉన్నారని.. ఎంతోమంది నటీనటులకు ఆయన స్ఫూర్తి అని చెప్పారు. అమితాబ్ సినిమాలు చూస్తూ పెరిగానన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను ముందుకువెళ్తున్నట్లు చెప్పారు. తాజాగా ఈ వీడియోను అమితాబ్ షేర్ చేశారు.'కృతజ్ఞతలు అల్లు అర్జున్. మీరు నా అర్హతకు మించి ప్రశంసించారు. నిజం చెప్పాలంటే నేను నీ ప్రతిభకు, నీ పనితీరుకు పెద్ద అభిమానిని. నువ్వు ఇలానే ఎంతోమందికి స్ఫూర్తినిస్తూ ఉండాలి. ఇలాంటి హిట్లు ఎన్నో అందుకోవాలని కోరుకుంటున్నా. శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. ఈ పోస్టు అల్లు అర్జున్ స్పందించారు. 'మీరు మా సూపర్ హీరో. మీ నుంచి ఇలాంటి ప్రశంసలు నమ్మలేకపోతున్నా. నాపై మీకున్న ప్రేమకు ధన్యవాదాలు' అని రిప్లై పెట్టారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# అలాంటి ప్రేమఅలాంటి ప్రేమ మరొకటి లేదు:

**సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్గా ఉంటారు నటి సమంత ప్రేమను ఉద్దేశించి తాజాగా ఆమె పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది.**



ఇన్ స్టాలో ఎంతో యాక్టివ్ గా ఉంటారు నటి సమంత ఆ ప్లాట్ ఫామ్ వేదికగా తన జీవితానికి సంబంధించిన పలు విషయాలను ఆమె తరచూ షేర్ చేసుకుంటారు. ప్రేమను ఉద్దేశించి తాజాగా ఆమె పెట్టిన పోస్టు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. తన పెంపుడు శునకం సాషాతో దిగిన ఓ ఫొటోని షేర్ చేశారు. "సాషా ప్రేమ మాదిరిగా మరొక ప్రేమ లేదు" అని క్యాప్షన్ జత చేసారు. ప్రస్తుతం ఇది నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.

# చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1868 : రసాయన శాస్త్రవేత్త ఫ్రిట్జ్ హేబర్ జననం (మ.1934).
- 1908 : పురాణ ప్రవచకుడు, సంస్కృతాంధ్ర పండితుడు రాంభొట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి జననం (మ.1995).
- 1946 : భారత జాతీయ కాంగ్రెసు మాజీ అధ్యక్షురాలు, భారత మాజీ ప్రధానమంత్రి, రాజీవ్ గాంధీ భార్య సోనియా గాంధీ జననం.
- 1946 : భారత రాజ్యాంగ సభ మొదటి సమావేశం జరిగింది.
- 1961 : పోర్చుగీసు వారి నుండి గోవా విముక్తి చెంది భారత్ లో విలీనమైనది.
- 1986 : భూదానోద్యమంలో భూమిని దానంచేసిన మొట్టమొదటి భూస్వామి వెదిరె రామచంద్రారెడ్డి మరణం (జ.1905). (చిత్రంలో)



ఫ్రిట్జ్ హేబర్



సోనియా





భారత రాజ్యాంగ



భారత్ లో



వెదిరె రామచంద్రారెడ్డి

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# రోహిత్ శర్మ అలా చేయడం వల్లే భారత్ ఓడింది :భారత మాజీ క్రికెటర్

**అడిలైడ్ టెస్టులో రోహిత్ శర్మ డిఫెన్సివ్ (రక్షణాత్మక) కెప్టెన్సీ వల్లే భారత్ ఓటమి పాలైందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా**



బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆసీస్తో జరిగిన రెండో టెస్టులో భారత్ 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలైంది. టెస్టుల్లో కెప్టెన్గా రోహిత్ శర్మ కు వరుసగా ఇది నాలుగో ఓటమి. అతని కెప్టెన్సీలో స్వదేశంలో కివీస్తో జరిగిన మూడు టెస్టుల సిరీస్లో భారత్ వైట్వాష్కు గురైన సంగతి తెలిసిందే. ఆసీస్లో రెండో టెస్టులో రోహిత్ ఇటు బ్యాటర్గాను, అటు సారథిగానూ విఫలమయ్యాడు. దీంతో రోహిత్ శర్మ కెప్టెన్సీ తీరుపై మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. అతని డిఫెన్సివ్ (రక్షణాత్మక) కెప్టెన్సీ వల్లే అడిలైడ్ టెస్టులో భారత్ ఓటమిపాలైందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా విమర్శించాడు. గత నాలుగు టెస్టుల్లో రోహిత్ కెప్టెన్సీ పేలవంగా ఉందన్నాడు. రెండో రోజు ఆటలో తొలి సెషన్లో బుమ్రాతో నాలుగు ఓవర్లే వేయించడాన్ని తప్పుబట్టాడు."జస్ప్రీత్ బుమ్రా నాలుగు ఓవర్లు వేశాడు. అప్పటికే ఒక వికెట్ తీశాడు. మరి, అతను నాలుగు ఓవర్లే ఎందుకు బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత అస్సలు బౌలింగ్ చేయలేదు? ఆ సెషన్ మొత్తం బౌలింగ్కు దూరంగా ఉన్నాడు. రోహిత్ కెప్టెన్సీలో ఒక ట్రిక్ మిస్ అయ్యాడని చెప్తున్నారు. అది 100 శాతం నిజం. అతను డిఫెన్సివ్ కెప్టెన్సీ చేశాడు. దీనివల్లే భారత్ చేతిలో నుంచి మ్యాచ్ చేజారింది. ఈ శతాబ్దంలో ధోనీ, కోహ్లి తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్లో ఓడిన కెప్టెన్ రోహితే కావడం ఆందోళన కలిగించే విషయం. అతని నాయకత్వంలో స్వదేశంలో వరుసగా మూడు ఓటములు ఎదురయ్యాయి. రోహిత్ కెప్టెన్సీ కాస్త పేలవంగా ఉంది' అని ఆకాశ్ చోప్రా అన్నాడు.2011, 2014 సంవత్సరాల్లో ధోనీ సారథ్యంలో భారత్ వరుసగా నాలుగు మ్యాచ్లో ఓటమి పాలైంది. 2020-21 మధ్య కెప్టెన్గా కోహ్లి వరుసగా నాలుగు మ్యాచ్లో విఫలమయ్యాడు. అడిలైడ్ టెస్టులో ఓటమి అనంతరం రోహిత్ మాట్లాడాడు. రెండు ఇన్నింగ్స్ ల్లోనూ బ్యాటింగ్లో విఫలమవడం, బుమ్రాకు ఇతర పేసర్ల నుంచి సరైన మద్దతు లేకపోవడంతో భారత్ ఓడిపోయిందన్నాడు. ఇక, ఆసీస్తో సిరీస్ విషయానికొస్తే మూడో టెస్టు బ్రిస్బేన్లోని గబ్బా స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ డిసెంబరు 14న ప్రారంభమవుతుంది.

# వీళ్లు పొరపాటున కూడా కిస్‌మిస్ తినకూడదు.. దూరంగా ఉంటేనే మంచిది..

ఆరోగ్యం

కరోనా తర్వాత చాలా మంది ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. మనం తినే ఆహారం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందుకే చాలా మంది తమ డైట్లో డ్రై ఫ్రూట్స్ భాగం చేసుకుంటున్నారు. అయితే, చాలా మంది బాదం పప్పు, పిస్తా, జీడి పప్పును తినడానికి జంకుతున్నారు. ఎందుకంటే మార్కెట్లో వీటి ధర ఎక్కువగా ఉండటమే. అందుకోసమే చాలా మంది తక్కువ ఖర్చులో దొరికే కిస్‌మిస్ లేదా ఎండు ద్రాక్షను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. నోటికి రుచిగా.. తియ్య తియ్యగా పుల్లగా ఉండే ఎండు ద్రాక్ష అంటే చాలా మందికి ఇష్టం. చిన్నా, పెద్దా తేడా లేకుండా దీనిని ఎంతో ఇష్టంగా తింటారు.ఉదయాన్నే పరగడుపున ఎండుద్రాక్షను చాలా మంది తీసుకుంటారు. అంతేకాకుండా చాలా మంది నీటిలో నానబెట్టిన కిస్మిస్‌ని తింటారు. దీనిని తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే చాలా మంది వీటిని తింటారు. అయితే, కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కిస్‌మిస్ తినకూడదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కొందరికి మేలు చేసే ఎండు ద్రాక్ష.. మరికొందరికి హాని చేసే ప్రమాదం ఉంది. పొరపాటున కూడా కిస్మిస్ ఎవరు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.






## ఎండు ద్రాక్షతో ఆరోగ్య ప్రయోజనాలు..



ఎండు ద్రాక్ష తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కిస్‌మిస్‌లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీనిని తినడం వల్ల రక్తహీనత సమస్యకు చెక్ పెట్టవచ్చు. దీనిని రోజూ తినడం వల్ల ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. లివర్ పనితీరు మెరగవుతుంది. రోజూ ఎండు ద్రాక్ష తినడం వల్ల దంత సమస్యలు తగ్గుతాయి. వీటిలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. దీంతో.. ఎముకల ఆరోగ్యానికి ఎండు ద్రాక్ష చాలా మంచిది. అలసట, నీరసంతో బాధపడేవారికి తక్షణ శక్తిని ఇస్తుంది ఎండు ద్రాక్ష. మూత్రనాళ ఇన్ఫెక్షన్లతో బాధపడేవారు వీటిని తినడం వల్ల మేలు జరుగుతుంది. ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, కొన్ని ఆరోగ్యసమస్యలతో బాధపడేవారు కిస్మిస్ జోలికి పోకూడదు. వాళ్లు ఎవరో ఓ లుక్కేద్దాం.



## జీర్ణ సమస్యలు..




సాధారణంగా కిస్‌మిస్ తినడం వల్ల జీర్ణ వ్యవస్థకు మేలు జరుగుతుంది. అయితే, జీర్ణ సమస్యలతో బాధపడేవారు వీటిని ఎక్కువగా తినకూడదు. కడుపు నొప్పి, ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలతో బాధపడేవారు వీటిని ఎక్కువగా తినకూడదు. వీటిని తీసుకుంటే అతిసారం వచ్చే ప్రమాదముంది. అంతేకాకుండా విరేచనలు, కడుపు నొప్పి సమస్యలు ఎక్కువయ్యే ప్రమాదముంది. అందుకే జీర్ణ సమస్యలతో బాధపడేవారు ఎండు ద్రాక్షను పరిమిత పరిమాణంలో తీసుకోవాలి.

## ఊబకాయం..



ఈ రోజుల్లో చాలా మంది ఊబకాయం సమస్యతో బాధపడుతున్నారు. ఇలాంటి వారు బరువు తగ్గడం కోసం ప్రయత్నిస్తారు. అందుకే బరువు తగ్గాలనుకునేవారు ఎండు ద్రాక్ష జోలికి పోకూడదు. ఎందుకంటే వీటిలో కేలరీలు అధికంగా ఉంటాయి. కిస్‌మిస్‌ను ఎక్కువగా తినడం వల్ల కేలరీలు బర్న్ అవ్వడం కష్టంగా మారుతుంది. దీంతో కొవ్వు పేరుకుపోతుంది. దీంతో మరింత బరువు పెరిగే ప్రమాదముంది.

## డయాబెటిస్..





ఎండు ద్రాక్షలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. టైప్-2 డయాబెటిస్‌తో బాధపడేవారు కిస్‌మిస్ తినకూడదు. వీటిని తింటే రక్తంలో షుగర్ స్థాయిలు పెరిగే ప్రమాదముంది. అందుకే ఇలాంటి వారు దూరంగా ఉండాలి. ఒకవేళ తినాలనిపిస్తే డాక్టర్‌ని సంప్రదించడం ఉత్తమం.

## అలర్జీ సమస్యలు..



చర్మ సంబంధిత అలర్జీలు, శ్వాసకోస సంబంధిత వ్యాధులతో బాధపడేవారు కిస్‌మిస్ ఎక్కువగా తినకూడదు. కిస్‌మిస్ తింటే అలర్జీ సమస్యలు పెరిగే ప్రమాదముంది. అలర్జీ కారణంగా చర్మంపై దద్దుర్లు, వాపులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండవచ్చు. అందుకే ఈ సమస్యలు ఉన్నవారు తినకపోవడమే మంచిది.

## జలుబు, దగ్గు ఉన్నవారు..



చలికాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో చాలా మంది జలుబు, దగ్గు సమస్యలతో బాధపడతారు. ఇలాంటి వారు కిస్‌మిస్ తినకూడదు. ఎండు ద్రాక్ష ఎక్కువగా తింటే ఈ సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదముంది. అంతేకాకుండా గొంతు నొప్పి వచ్చే ప్రమాదముంది. ఈ సమస్యలు లేనివారు చలికాలంలో ఏం చక్కా కిస్మిస్ తినవచ్చు. వీటిని తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరానికి మేలు చేసే ఎండుద్రాక్షను అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. అందువల్ల, ఎల్లప్పుడూ పరిమిత పరిమాణంలో మాత్రమే తినండి.

**గమనిక..** ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.